



నామినేషన్‌కు హాజరైన టీడీపీ,జనసేన, బీజేపీ నేతలు



● రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, అన్నం సతీష్ ప్రభాకర్, రాకేష్ వర్మ

డెల్టా.. ఉల్టా

- జగన్ పాలనలో నీరందక ఎండిన డెల్టా భూములు
- డెల్టా కాల్వలన్నీ ఛిద్రం... రైతు బతుకు దుర్భరం
- ఒక్క కాల్వకట్టపై పలిక మన్ను వేసిందిలేదు
- చుక్కనీరందక రైతులకు నాలుగేళ్ళూ కష్టాలే
- పట్టిసీమకు ఆనాడు పట్టం... జగన్ పాలనలో పట్టించుకోక నష్టం

గత ఐదేళ్లలో రైతన్నకు మాత్రం ఒక సంవత్సరం వర్షాలు సకాలంలో పడితే, మిగిలిన నాలుగేళ్లు సాగునీటి కష్టాలు తప్పలేదు. అటు జలాశయాల్లో నీటి నిల్వలూ అంతంతమాత్రంగా ఉంటే, కనీసం పట్టిసీమను కూడా సరిగా వినియోగించుకోలేని అసమర్థ రైతులపాలిట శాపంగా మారింది. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. తూర్పు, పశ్చిమ కాల్వలకింద రెండు జిల్లాల్లో సాగుభూమి ఉంటే వాటిపైనా మరమ్మతులు నోచుకోక దిగుబడిపై పెద్ద ప్రభావమే పడింది. వర్షాలు సకాలంలో పడితే మినహా దిగుబడి దక్కిన పరిస్థితిలేదు. అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయి లో జరగలేదు. జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు.



తెనాలి మండలం హాఫ్‌పేట-గుంటూరు మధ్య గత ఖరీఫ్‌లో సాగునీరందక ట్యాంకర్‌లతో నీటిని పంటలకు అందిస్తున్న రైతులు



తూములు పూడిపోయి, కట్టల మట్టి కోతపడి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్నా ఖరీఫ్‌కు ముందు అత్యవసర మరమ్మతులు చేయకుండా వదిలేసిన చిత్రం



హైలెవల్ ఛానల్ పనులు చివరి దశకు చేరినా ఐదేళ్లుగా ఒక్క పనికూడా చేయకుండా రైతులకు శాపంగా మార్చిన ప్రభుత్వ తీరు

తెనాలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒక్క కాల్వపై మరమ్మతులు చేసింది లేదు.. గండ్లు పడినా.. షట్టర్లు దెబ్బతిని నీరు వృధాగా పోయినా.. తూములు, కల్వర్టులు దెబ్బతినిపోయినా వాటికి రాయో, రప్పో అడ్డుపెట్టుకుని రైతన్నే నీటిని కాపాడుకున్నాడు. కాల్వల చివరి భూములకు ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే.. చుక్కనీరు కిందికి వెళ్లిందే లేదు కనుక రైతులు పొలాలను ఎడారిగా వదిలేశారు. అరకొరగా వచ్చే ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఒ.అండ్.ఎం) నిధులే ఆధారమైతే వాటినీ అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టర్ అవతారమెత్తి మేసేశారు. దీంతో ఆ మాత్రం మరమ్మతులు కూడా లేక కృష్ణా పశ్చిమ డెల్టా కుదేలైంది. ఎప్పుడో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డెల్టా కాల్వల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రాంతానికి రూ.1,400 కోట్లు మంజూరయితే వాటిలోనూ ప్రధాన కాల్వలు ఆధునికీకరణకు నోచుకోలేదు. తర్వాత టీడీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక జరిగిన మరమ్మతులు మినహా, జగన్ సర్కారు వచ్చాక రైతన్నకు కన్నీరే మిగిల్చింది.

మరమ్మతుల కోసం రైతన్న మొక్కు...

డెల్టా కాల్వల ఆధునికీకరణ తర్వాత సాగునీటి సంఘాల ద్వారా చాలావరకు కాల్వల పనులు జరిగేవి. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు, నిజాంపట్నం ఛానల్స్‌కు పనులే జరగలేదు. వీటికి సంబంధించి అప్పట్లోనే రూ.600 కోట్లు వృధాగా వెనక్కుపోయాయి. దీంతో ఈ కాల్వలకు గండ్లు పడటం ఏటా ఒక ఆనవాయితీగా మారిపోయింది. కృష్ణా పశ్చిమ డెల్టా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉంది. ఒక ఖరీఫ్ సాగు గట్టెక్కాలంటే కనీసం 60 నుంచి 70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. అంటే పశ్చిమ డెల్టా కాల్వలకు నీరందించే ప్రధాన కాల్వకు రోజూ 8,200 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజి నుంచి వదలాలి. కానీ ఎప్పుడూ ఇంతటి సామర్థ్యంతో నీటిని వదలటం కానీ, కాల్వల చివరి భూములకు పుష్కలంగా నీరందించిన పరిస్థితే లేదంటే అతిశయోక్తి కాదు. దీనిలో కొమ్మమూరు కాల్వయితే అన్నిటికీ చెడ్డ పరిస్థితి. అటు ఆధునికీకరణలో రూ.400 కోట్లతో జరగాల్సిన పనులు జరగలేదు. తర్వాత జల రవాణా పేరుతో తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనూ శాశ్వత పనులేవీ చేయనివ్వలేదు.

తాత్కాలిక మరమ్మతులకే పరిమితం చేశారు. ఇప్పుడు జల రవాణాను నిలిపివేసినట్టు కేంద్రం ఎప్పుడో ప్రకటించినా వైసీపీ సర్కారు మాత్రం అత్యవసర మరమ్మతులుకూడా చేయలేదు. ఈ కాల్వల కింద 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, 63 కి.మీటర్ల పొడవున్న ఈ కాల్వపై ఒక్క పనీ జరగలేదు. దీంతో పొన్నూరు, బాపట్ల మండలాల పరిధిలో చాలాసార్లు కట్టలకు గండ్లు పడి ప్రకాశం జిల్లాలోని చివరి భూములకు గత మూడేళ్లుగా నీరు సరిగా అందని పరిస్థితి.

పట్టిసీమపై పంతం పట్టి...

కృష్ణా డెల్టాకు ఎగువ జలాశయాలలో నీటి నిల్వలు అడుగుకుపోయి, ప్రాజెక్టుల నుంచి నీరు అందని తరుణంలో పంటలను దక్కించుకోటానికి పట్టిసీమ గుండెకాయలాగా ఉపకరించింది. గతంలో కృష్ణా నదిపైఉన్న



హైలెవల్ ఛానల్ కింద నీరు అందక ఎండిన వరి, నెర్రెలిచ్చిన నేల

జలాశయాలు నిండుకుని నీరు రాక పంటలు ఎండిపోవటంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించటానికి పట్టిసీమను తీసుకొచ్చారు. వృధాగా సముద్రంలో కలసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోటానికి ఆయన పట్టిసీమ ద్వారా 20 మోటార్లను అమర్చి నీటిని పంప్‌చేస్తే, జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు. గత ఖరీఫ్‌లో మరీ ఇబ్బందిగా ఉండటంతో పట్టిసీమ ద్వారా 14 రోజులు మాత్రమే నీటిని తీసుకున్నారు. మిగిలిన రోజులు కూడా తీసుకోగలిగితే ప్రస్తుతం అడుగుకు చేరిన పులిచింతల నీటిని తాగునీటి కోసం తోడెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే సాగు, తాగునీటి విషయంలో జగన్ సర్కారు ఏ ఒక్క సంవత్సరం ఒక ప్రణాళికతో నీటిని వినియోగించిన పరిస్థితి లేదు. ఆ కాల్వలకు మరమ్మతులు చేయక, పాడైన పంపులను పట్టించుకోక నిరుపయోగం చేసేశారు. ప్రధానంగా ఈ రెండు ఖరీఫ్ సీజన్‌ల నుం చి పట్టిసీమ వినియోగించని ప్రభావం ప్రత్యక్షంగా రైతులకు కనిపించింది.

ఓ అండ్ ఎం నిధులూ మింగేసి..

డెల్టా కాల్వలకు ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదేలేదు. ఈ ఐదేళ్ల లో ఒక్క రూపాయి కూడా సాగునీటి కాల్వల మరమ్మతుల కోసమని ఖర్చు చేసిందిలేదు. ఏయేడాదికాయేడాది నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల అత్య వసర మరమ్మతులు, కట్టలు బలపరచటం, వంతెనలు, షట్టర్ల మరమ్మతుల వంటి వాటికోసం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపటం, అవి బుట్టదాఖలవటంతో వారూ చేతులు దులుపుకుని ఓ అండ్ ఎం కింద వచ్చే నిధులతో పనులు చేయించేందుకు పరిమితమయ్యారు. ఇవి మాత్రం రైతులు కట్టే నీటి తీరువా ఆధారంగా ప్రభుత్వానికి జమయ్యే నిధుల నుంచి వాటాలు విడుదల చేయటమే కనుక వసూలైన నీటి తీరువా లక్ష్యంలో సగ భాగం కూడా మరమ్మతులకు కేటాయించిన పరిస్థితి లేదు. వీటికీ నీటిపారుదల శాఖ అధికారులు ప్రతి సంవత్సరం రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపితే వాటిలో పదిహేను, ఇరవై కోట్లు ఇచ్చి చేతులు దులుపుకోవటంకూడా ఒక పరిపాటిగా మారింది. ఇవి కూడా సరిగ్గా కాల్వలకు నీరు వదలటానికి వారం, పది రోజుల ముందు విడుదల చేస్తే, ఆ పనులనూ అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్ అవతారమెత్తి పనులు చేయకుండానే నిధులు దోచేసిన పరిస్థితులున్నాయి. వీటిపై రైతులు ఎక్కడైనా నిలదీస్తే వారిపై దాడులు చేసిన పరిస్థితీ ఉంది. గత ఖరీఫ్‌లో ఓ అండ్ ఎం కింద రూ.22 కోట్లు మంజూరైనా వాటితో కనీసం పూడిక కూడా తియ్యకపోవటంతో కొం దరు వైసీపీ అభిమానులుగా ఉండే రైతులు కూడా తామే ఖర్చులు పెట్టుకుని చేయించుకున్న పరిస్థితి ఉంది.

అసంపూర్తిగా కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పనులు

అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ కాల్వపైనా ఆధారపడి 1.2 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. దీనిలో సగభాగం వరకే ఖరీఫ్, రబీ రెండు పంటలకు నీరందితే, మిగిలిన సగం ఒక్క పంటకే పరిమితం చేశారు. ఈ ఖరీఫ్‌లో అయితే ఆ ఒక్క పంటకు కూడా నీరందటం గగనమైపోయింది. మరోపక్క గుంటూరు జిల్లాలో హైలెవల్ ఛానల్ కింద సాగవుతున్న 26వేల ఎకరాల పరిస్థితి మరీ దారుణం. కాల్వలకు ప్రారంభంలోనే ఉన్నా నీరందదు. రెండు సంవత్సరాలు ఖరీఫ్ నీరందక ఎండిపోయిన వరి పంటను తగలబెట్టిన దారుణ పరిస్థితి కూడా ఉంది. దీనిని తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో గత ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చొరవ చూపించి హైలెవల్ ఛానల్ ఆధునికీకరణకు పూనుకున్నారు. ప్రధాన కాల్వకన్నా ఎత్తు ఉండటంతో నీటిని పంప్ చెయ్యటం కానీ, ప్రధాన కాల్వలో కనీసం 3వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఎప్పుడూ ఉండేలా చూడటం కానీ అవసరం. దీనిలో పంప్‌చేసి నీటిని పంపాలని పెదవడ్లపూడి దగ్గర మెయిన్ కెనాల్‌పై మోటార్‌లతో నీటిని హైలెవల్ ఛానల్‌కు మళ్లించేలా గత టీడీపీ కాలంలో పనులు చేయించారు. ఇంకా కేవలం 5 శాతం పనులు, అంటే తుది మెరుగులు మాత్రమే పూర్తిచేసి నీటిని పంపే అవకాశం ఉంది. అయితే జగన్ సర్కారు వచ్చి ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు దీనిపై ఒక్కసారి కూడా దృష్టి పెట్టలేదంటే రైతులపై, సాగునీటి వినియోగంపై ఎంత శ్రద్ధ ఉందనేది అర్థమవుతుంది.

నరేంద్రవర్మకు నీరాజనం

అట్టహాసంగా వేగేశన నామినేషన్ ● అల్లూరు నుంచి బాపట్ల వరకు పసుపుహారం

● అడుగడుగునా హారతులు, గజమాలలతో సత్కారం

బాపట్ల, పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 23: మండే ఎండ.. అభిమాన సందోహం.. అడగడుగునా హారతులు.. గజమాలలతో సత్కారంతో నరేంద్రవర్మకు ప్రజలు నీరాజనం పలికారు. కూటమి తరపున బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మ మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకముందు పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నరేంద్రవర్మ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూటమిశ్రేణులతో కలిసి అల్లూరు, అలకాపురం, ఖాజీపాలెం, జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం, కొత్తపాలెం, చందోలు, రెడ్డిపాలెం గ్రామాల మీదగా బాపట్లకు చేరుకున్నారు. లోక్‌సభ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, పార్టీశ్రేణులతో కలిసి వేగేశన నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎండను లెక్క చేయకుండా పార్టీశ్రేణులు జేజేలు పలకగా, మహిళలు హారతులు పట్టి విజయతిలకం దిద్ది నరేంద్రవర్మను ఆశీర్వదించారు. అల్లూరు నుంచి బాపట్ల వరకు పసుపుహారంలా నరేంద్రవర్మ దండు తరలివచ్చింది. అశేష జనవాహిని నడుమ నామినేషన్‌కు కదిలిన నరేంద్రవర్మకు స్వాగతం పలుకుతూ ప్రతి గ్రామంలో క్రేన్ సాయంతో గజమాలలతో అభిమానులు సత్కరించారు. రోడ్‌షోలో యువత బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని శ్రీనివాస థియేటర్, గడియారస్తంభం సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్‌షో జరిగింది. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, యువ నాయకుడు వేగేశన రాకేష్‌వర్మ, న్యాయవాదులు శ్రీనివాసరావు, ఊట్ల రామారావులతో కలిసి రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ శ్రీధర్‌కు నరేంద్రవర్మ నామినేషన్ పత్రాలు అందజేశారు. నరేంద్రవర్మ తరపున ఆయన భార్య వేగేశన హరికుమారి ఒకసెట్ నామినేషన్ దాఖలు చేయగా ఇప్పటి వరకు ఆయన తరపున నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శులు సలగల రాజశేఖర్, తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు

పనులు లేవు.. వైసీపీ నామినేషన్‌కు వెళ్లండి

● మార్టూరులో ఉపాధి సిబ్బంది తీరుపై కూలీల ఆగ్రహం



● వలపర్లలో ఉపాధి పనిని నిలిపివేయడంతో వెనుదిరుగుతున్న కూలీలు

మార్టూరు, ఏప్రిల్ 23: వైసీపీ పర్చూరు అభ్యర్థి ఎడం బాలాజీ నామినేషన్ కార్యక్రమానికి రావాలని మంగళవారం ఏకంగా ఉపాధి పనులను నిలిపివేశారు. కొద్ది రోజులుగా గ్రామంలో ఉపాధి పనులు సాగుతున్నాయి. మంగళవారం ఉదయాన్నే మహిళలు, వృద్ధులు ఉపాధి పని జరిగే ప్రదేశానికి వెళ్లారు. ఈరోజు బాలాజీ నామినేషను కార్యక్రమానికి అందరూ వెళ్లాలి పనులు జరగవు అని అక్కడున్న ఉపాధి సిబ్బంది చెప్పారు. దీంతో కూలీలు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. ఎక్కడో నామినేషన్ వేస్తే మేమెలా వెళ్లగలమని పలువురు వృద్ధులు వాపోయారు. పని కోసం ఎంతో దూరం నడిచివస్తే ఇలా నిలిపి వేయడం దారుణమని మండిపడ్డారు. కోడ్ ఉన్నా వైసీపీ మద్దతుదారులుగా ఉన్న ఉద్యో గులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ దొంగల పార్టీ

- అప్పుల ఊబిలోకి ఆంధ్రప్రదేశ్
- ప్రజల చేతికి చిప్ప ఇచ్చిన సీఎం జగన్
- చీరాల, కర్లపాలెంలో షర్మిల న్యాయయాత్ర
- ఆమంచికి బీఫాం.. నామినేషన్ ర్యాలీలో పీసీసీ చీఫ్ షర్మిల



చీరాల, కర్లపాలెం, ఏప్రిల్ 23: వైసీపీ దొంగల పార్టీ. దోపిడీ రాజ్యం. రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజల చేతికి ముఖ్యమంత్రి జగన్ చిప్ప ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న ప్రజాధనాన్ని, ప్రజల ఆస్తులను కొల్లగొట్టడానికే జగన్మోహనరెడ్డి సిద్ధం సిద్ధమంటూ పిలుపిస్తున్నారు. ప్రజలందరూ ఈ వాస్తవాన్ని గ్రహించాలి.. అని పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో మంగళవారం షర్మిల ఏపీ న్యాయ యాత్ర జరిగింది. సోమవారం రాత్రి అద్దంకి పర్యటన ముగిసిన అనంతరం ఆమె వేటపాలెం మండలంలో రిసార్ట్స్‌లో బస చేశారు. మంగళవారం పందిళ్లపల్లిలోని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నివాసానికి చేరుకుని ఆయనకు కాంగ్రెస్ పార్టీ బీఫారం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ అగ్రభాగాన ఆమంచి, ఆ వెనుక ఏపీ న్యాయ యాత్ర వాహనంలో షర్మిల దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చీరాల గడియార స్తంభం సెంటర్ నుంచి షర్మిల బాపట్లకు పయనమయ్యారు. దీంతో ఆమంచి కాంగ్రెస్ పార్టీ బాపట్ల లోక్‌సభ అభ్యర్థి జేడీ శీలం మరికొందరితో కలసి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్వో సూర్యనారాయణరెడ్డికి నామినేషన్ పత్రం అందజేశారు.



సభకు హాజరైన జనం

వైఎస్ ఆశయాలకు జగన్ తూట్లు

చెప్పినమాట నిలబెట్టుకోవడమే కాక, మడమతిప్పని మాటతప్పని మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అయితే జగన్మోహనరెడ్డి దీనికి పూర్తి భిన్నమని కర్లపాలెంలో జరిగిన సభలో షర్మిల సీఎంపై ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్నారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తే జగన్ సాగిలపడుతున్నారన్నారు. వరద ముంపు సమయంలో బాపట్ల వచ్చిన జగన్ నల్లమడను ఆధునికీకరిస్తానని చెప్పి పట్టించుకోలేదన్నారు.

భూ దందాలకు అడ్డగా బాపట్ల

నియోజకవర్గం ఇసుక దోపిడీకి, భూ దందాలకు అడ్డగా మార్చారన్నారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే భూబకాసురుడని ఆరోపించారు. పేదల భూములను తక్కువకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నా మళ్లీ ఆయనకే టికెట్ ఇచ్చి దోచుకోమని నియోజకవర్గాన్ని అప్పజెప్పారన్నారు. ఓటు మీచేతిలో ఉన్న ఆయుధమని ప్రతి ఒక్కరు గుర్తెరిగి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు జేడీ శీలం, గంటా అంజిబాబు, పార్టీ మండల అధ్యక్షులు యోహోషువా, సిరాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌పై కాలయాపన

- రివర్స్ టెండరింగ్ పేరుతో పనులకు ఆటంకం
- ఆధునికీకరణపై ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- చంద్రబాబు హామీపై విశ్వాసం వ్యక్తం చేస్తున్న రైతులు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానల్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చి టెండర్లు కూడా పూర్తి చేసిన ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేసింది. జిల్లా సమీక్ష మండలి సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు గురించి ప్రశ్నించినప్పుడు సరైన సమయంలో పనులు చేపడతామని ఇన్‌చార్జి మంత్రులు సెలవిచ్చారు. కడుపు మండి రైతులు రోడ్డెక్కి వంద రోజులకు పైగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహించినా జగన్ ప్రభుత్వం దయ తలచలేదు. కంటితుడుపు చర్యగా ఛానల్ పొడిగింపు కోసం అవసరమైన భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్లు విడుదల చేసి చేతులు దులుపుకొన్నది. అది కూడా జగన్‌కు సంబంధించిన రోత పత్రికకు భూసేకరణ నోటిఫికేషన్ల రూపంలో ఆర్థికంగా రూ.లక్షల్లో మేళ్లు చేసేందుకు ఈ చర్యలు చేపట్టింది. ఈ ఛానల్ పొడిగింపుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించగా అప్పట్లోనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి టెండర్లు కూడా నిర్వహించారు. ఛానల్ ఆధునికీకరణ జరిగితేనే పొడిగింపు చేపట్టవచ్చు. ఈ దృష్ట్యా మొత్తం రూ.652.78 కోట్లతో గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులను టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు ప్రారంభమౌతాయనుకుంటున్న సమయంలో 2019లో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది అధికారం చేపడుతూనే రివర్స్ టెండరింగ్ పేరుతో అవార్డు అయిన కాంట్రాక్టులను కూడా నిలిపేసింది. అది మొదలు నేటివరకు ఫైళ్లలోనే ఈ రెండు ప్రాజెక్టులు కదులుతున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో ఏమీ జరగలేదు. ఛానల్ పొడిగింపు కోసం దాదాపుగా 389.81 ఎకరాల భూమిని రైతుల వద్ద సేకరించాలి. ఇందుకోసం కనీసం రూ.110 కోట్ల వరకు నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఆ మొత్తం కూడా వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో విడుదల చేయలేదు. కాగా ఇటీవలే ప్రత్తిపాడులో పర్యటించి టీడీపీ అధినేత చంద్రబాబు తాము అధికారంలోకి రాగానే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామని చెప్పడంతో రైతులు ఆయన మాటలను విశ్వసిస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై గల్లా మాధవి తదితరులు

ఏపీని గంజాయి హబ్‌గా మార్చారు

- గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి హబ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం గుంటురు నగరంలోని వికాస్‌నగర్ సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ పెమ్మసానితోపాటు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గళ్లా మాధవి హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో సాధారణ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు సైతం లక్షల జీతం ఆర్జిస్తుంటే, జగన్‌పాలనలో విద్యార్థులంతా గంజాయి, పిచ్చి మద్యానికి బానిసలుగా మారి సమాజానికి, తల్లిదండ్రులకు భారంగా మారారని ఆవేదన వ్యక్తంచేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ చేయటానికి మాత్రమేనని అవినీతి, అరాచకాలు అనే పదాలకు అర్థం కూడా తెలియదని అన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఏటేటా జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం తదితర హామీలతో ప్రజలను నమ్మించి వంచించారని, చంద్రబాబు అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు డీఎస్సీతో పాటు తదితర నోటిఫికేషన్ల దస్త్రంపై మొదటి సంతకం చేస్తానని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ మంత్రి హోదాలో ఉన్న రజిని తనసొంత నియోజకవర్గం చిలకలూరిపేటలో పోటీచేసే ధైర్యంలేక గుంటూరు పశ్చిమానికి పారిపోయి వచ్చిందన్నారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ హవా వీస్తున్నప్పుడే గుంటూరు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న టీడీపీకి, అవినీతి అనకొండలైన రజిని, రోశయ్యలను తరిమి కొట్టడం ఒక లెక్క కాదన్నారు. సమావేశంలో జనసేన ముఖ్య నేతలు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డేగల ప్రభాకర్, గల్లా రామచంద్రరావు, కొమ్మినేని ప్రసాద్, సింహాద్రి కనకాచారి, పిల్లి మాణిక్యరావు, యాగంటి దుర్గారావు, కొమ్మినేని కోటేశ్వరరావు, మద్దిరాల మ్యానీ, ఎలుకా వీరాంజనేయులు, లంకా ఉదయ్, వేములపల్లి శ్రీరామ ప్రసాద్, పోతురాజు సమత, నూకవరపు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

నగదు, చీరలు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మంగళగిరి నియోజకవర్గంలో రూ.70,930 నగదు, పొన్నూరు నియోజకవర్గంలో రూ.4,20,335 విలువకలిగిన 460 చీరలు, 460 ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 23 సాయంత్రం 6గంటల వరకు రూ 2,36,20,465 ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

నాయి బ్రాహ్మణులను ఆదుకుంటాం

- దేవస్థానం ధర్మకర్తలుగా అవకాశం
- మునిసిపల్ కాంప్లెక్సుల్లో దుకాణాలు కేటాయిస్తాం
- ఆదరణ పథకం పునరుద్ధరణకు చర్యలు
- నాడు, నేడు బీసీలకు అండ టీడీపీనే
- నాయి బ్రాహ్మణులతో భేటీలో నారా లోకేశ్


లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయిబ్రాహ్మణులు

మంగళగిరిసిటీ, ఏప్రిల్ 23: ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయిబ్రాహ్మణులను అన్నివిధాలా ఆదుకుంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎన్డీఏ కూటమి అభ్యర్థి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం నాయిబ్రాహ్మణులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ వృత్తిరీత్యా నాయిబ్రాహ్మణులు అహర్నిశలు కష్టపడుతుంటారని చెప్పారు. వారికష్టాన్నిచూసి మంగళగిరి నియోజకవర్గంలో నాయిబ్రాహ్మణ వృత్తిదారులకు 122 సెలూన్ షాపులకు కుర్చీలు అందజేశామని తెలిపారు. పేదరికంలేని మంగళగిరిని స్థాపించాలన్న లక్ష్యంతో అధికారంలో లేకపోయినప్పటికీ సొంత ఖర్చులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశానని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల పాలక మండళ్లలో నాయిబ్రాహ్మణులకు ధర్మకర్తలుగా అవకాశం కల్పిస్తామని, మునిసిపల్ కాంప్లెక్సుల్లో కొన్నిషాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దేవాలయాల్లో క్షురకులుగా నాయిబ్రాహ్మణులను మాత్రమే నియమించే విధంగా గత జీవోలను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బీసీలకు నాడు-నేడు పెద్దపీట వేసింది తెలుగుదేశం మాత్రమేనన్నారు. జయహో బీసీ కార్యక్రమం ద్వారా ఇప్పటికే బీసీ డిక్లరేషన్ ప్రకటించామన్నారు. బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అందిస్తామని, ఆదరణ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టి ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు. బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి బీసీ వర్గాలకు ఆర్థిక చేయూతనందిస్తామని లోకేశ్ తెలిపారు.


నాయిబ్రాహ్మణులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

సమస్యలపై నాయిబ్రాహ్మణుల వినతి

నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. దేవాలయాల్లోని కేశ ఖండనశాలల్లో ఉపాధి కల్పించాలని, దేవాలయకమిటీల్లో సభ్యులుగా అవకాశం ఇవ్వాలని, కార్పొరేట్ సెలూన్ల రంగప్రవేశంతో ఉపాధి దెబ్బతిందని, తమకు తక్కువ అద్దెతో మునిసిపల్ కాంప్లెక్సుల్లో షాపులు కేటాయించాలని, అమరావతిలోనాయిబ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి వైద్య నారాయణస్వామి దేవాలయం నిర్మించాలని, కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని, దేవాలయాల్లోని కేశఖండన శాలల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సెలూన్ షాపులకు రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని సక్రమంగా అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లోకేశ్ స్పందిస్తూ దామాషా ప్రకారం కమ్యూనిటీ హాళ్ల నిర్మిస్తామని, నాయి బ్రాహ్మణ వృత్తిదారులు కార్పొరేట్ పోటీని తట్టుకునే విధంగా అధునాతన శిక్షణకు చర్యలు తీసుకుంటామని, విదేశీ విద్య పథకాన్ని గతంలో మాదిరిగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను ఒంటరిని చేసిన వైసీపీ

- మీటింగ్‌కు వెళ్లొద్దంటూ జడ్పీటీసీలకు ముఖ్య నేత ఆదేశాలు
- ఓవర్ యాక్షన్ చేస్తే పదవులు పోతాయని హెచ్చరిక
- రావాలని ఉన్నా సమావేశానికి రాలేక పోయిన సభ్యులు
- జిల్లా పరిషత్‌లో రాజకీయ అలజడి


కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేసి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23: గుంటూరు జిల్లా పరిషత్ రాజకీయ ముఖ చిత్రం మారిపోయింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాపై అధికార వైసీపీ కత్తి కట్టింది. జడ్పీ చైర్ పర్సన్, ఆమె భర్త ఎన్నో ఏళ్ళ పాటు ఆ పార్టీకి విధేయులుగా వున్నప్పటికీ ఏకకాలంలో ఒంటరిని చేసింది. మంగళవారం జిల్లా పరిషత్‌లో జరిగిన సంఘటనలు ఈ మాటలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. మూడు నెలల కాల వ్యవధి ముగియడంతో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సమావేశం నిర్వహణపై జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని మరీ నిర్వహించారు. ఉదయం స్థాయి సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాధారణ సమావేశం జరుగుతుందని సభ్యులకు సమాచారం అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీటీసీలతో కలిపి మొత్తం 86 మంది సభ్యులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. అయితే స్థాయి సంఘాల చైర్మన్ హోదాలో క్రిస్టీనా సమావేశం నిర్వహించినప్పటికీ సభ్యులు గా ఉన్న జడ్పీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. సభ్యులు వస్తారేమో అని చైర్ పర్సన్ చాలా సేపు ఎదురు చూసినప్పటికి ఎవరూ రాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 2గంటలకు సాధారణ సమావేశం ప్రారంభం అయ్యాక కేవలం ఆరుగురు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి చైర్‌పర్సన్ ఛాంబర్‌కు వెళ్లిపోయారు.

తెర వెనుక చాలా జరిగింది...

ప్రస్తుత ఎన్నికల్లో సీటు ఇస్తామని ఆశచూపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దంపతులకు మొండిచేయి చూపించారు. వేమూరు, తాడికొండ నియోజకవర్గాల్లో కత్తెర సురేష్ చాలా సంవత్సరాలు ఎంతో ఖర్చు చేసి పార్టీ కోసం కష్టపడ్డారు. అక్కడ వేరే వారికి సీటు కేటాయిస్తూ జగన్ చైర్ పర్సన్ దంపతులను పిలిపించి మాట్లాడారు. యర్రగొండపాలెం సీటు ఇస్తామని హామీ ఇచ్చి పంపారు. ఆ సీటుకూడా వేరే వారికి ఇవ్వటంతో చైర్ పర్సన్ దంపతులు చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అప్పటి నుంచి వైసీపీ అధిష్ఠానం గుర్రుగా ఉంది. ఇంతలో జిల్లా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించాల్సి రావడంతో జిల్లా వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. సమావేశానికి రావద్దంటూ జడ్పీటీసీలను ఆదేశించారు. వస్తేపదవులు పోతాయంటూ బెదిరించినట్లు తెలుస్తోంది. ముఖ్యనేతల ఆదేశాలతో జడ్పీటీసీలు జిల్లా పరిషత్‌కు వచ్చేందుకు సాహసించలేదు. వచ్చిన కొద్దిమంది భోజనాలు విషయంలో వివాదం రేపేందుకు ప్రయత్నించటంతో అప్రమత్తమైన జడ్పీ డిప్యూటీ సీఈవో వారిని శాంతిపచేశారు.

జడ్పీ చైర్ పర్సన్‌పై రాజకీయ కుట్ర ?

పంచాయతీరాజ్ చట్ట ప్రకారం జడ్పీ చైర్‌పర్సన్‌పై ఇప్పుడప్పుడే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదు. అప్పటి వరకు ఆమె అధికారాలకు కత్తెర వేయాలన్న ఆలోచనలో వైసీపీ ముఖ్య నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సాధారణ సమావేశం బహిష్కరింప చేసినట్లు అర్థం అవుతుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జడ్పీ పాలన వ్యవహారంపై దృష్టి సారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అప్పటి వరకు చైర్‌పర్సన్ ప్రతి కదలిక పైన నిఘా ఉంచాలని తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

గుర్రుగా ఉన్న అనుకూల వర్గం..

జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని చూసి చైర్‌పర్సన్ అనుకూల వర్గం వైసిపి నేతల తీరుపై గుర్రు గా వున్నారు. ఇన్ని సంవత్సరాలు అనుకూలంగా ఉన్నప్పటికీ వెంటనే ఒంటరి ని చేసే ప్రయత్నం చెయ్యటం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు జడ్పీటీసీలు, ఉద్యోగులు కూడా చైర్ పర్సన్ అండగా నిలిచేందుకు సిద్ధమయ్యారు.

నలుగురు ఉద్యోగులపై చర్యలు

- పది కేసుల నమోదు • చిలకలూరిపేట ఆర్వో వెల్లడి


ఆర్వో నారదముని

చిలకలూరిపేట, ఏప్రిల్ 23: చిలకలూరిపేట అసెంబ్లీనియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు నలుగురు ఉద్యోగుల పై చర్యలు తీసుకున్నట్లు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.నారద ముని మంగళవారం చెప్పారు. వీరంతా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించని కారణంగా ఈమేరకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నలుగురిలో ఒక ఆర్పీ, ఒక వీఆర్ఏను సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు. ఒక అసిస్టెంట్ బిల్ కలెక్టర్, నాన్ పబ్లిక్ హెల్త్ ఉద్యోగి, వాటర్ సప్లయ్ విభాగం ఉద్యోగిని విధుల నుంచి తప్పించినట్లుగా ఆయన వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించని కారణంగా ఇప్పటి వరకు పది కేసులు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఇప్పటి వరకు 435 పర్మిషన్‌లను ఆయా పార్టీల వారు అడిగారని, ఇందులో 401 పర్మిషన్‌లు ఇచ్చామని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు నియోజకవర్గపరిధిలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 264.82 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, సరైన పత్రాలు లేకుండా తీసుకు వెళ్తున్న రూ 35.08 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. నియోజక వర్గ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది నామినేషన్‌లు దాఖలయ్యాయని తెలిపారు. ఇప్పటికే ఒక విడత శిక్షణా తరగతులు పీవోలు, ఏపీవోలకు నిర్వహించామని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లకు కూడా శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆయన కోరారు.


టీడీపీ కార్యకర్తలపై కర్రతో దాడి చేస్తున్న వైసీపీ మూక

టీడీపీ కార్యకర్తలపై దాడి

పొన్నూరుటౌన్, ఏప్రిల్23: పొన్నూరు పట్టణంలో మంగళవారం టీడీపీ కార్యకర్తలపై నాయకులు దాడికి దిగిన ఘటన చోటుచేసుకుంది. మంగళవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నామినేషన్ దాఖలుకు వైసీపీ కార్యకర్తలు నాయకులు పట్టణంలోకి వచ్చారు. అయితే ఆ సమయంలో మామిళ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని మరో ఇద్దరు రెండు వాహనాలపై టీడీపీ జెండాలను తీసుకువెళుతున్నారు. ఆ సమయంలో ఆ కార్యకర్తలను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు విచక్షణ రహితంగా కర్రలతో దాడి చేసి దార్ల రవి కిరణ్‌ను తీవ్రంగా కొట్టారు. 24వ తేదీన జరిగే నామినేషన్ దాఖలు కార్యక్రమానికి జెండాలు తీసుకువెళుతునామని ప్రదర్శించలేదని చెప్పినప్పటికి వినకుండా తీవ్రంగా దాడి చేయటమే కాకుండా దుర్భాషలాడుతూ వైసీపీ శ్రేణులు కొట్టి గాయపరిచారని రవి కిరణ్ వాపోయాడు. ఈ ఘటనపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రవికిరణ్ వెల్లడించారు. గాయపడిన రవి కిరణ్‌ను ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఫోన్‌లో పరామర్శించి సంఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద వెండిసీజ్

తెనాలిరూరల్, ఏప్రిల్23: మండలంలోని నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద బిల్లులు లేకుండా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న వెండిని సీజ్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ సుల్తాన్ అనే వ్యక్తి విజయవాడ నుండి తెనాలికి బస్సులో మంగళవారం సుమారు 3 కేజీల 410 గ్రాముల వెండితో వస్తున్నాడు. మార్గ మధ్యమైన నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక బృందాలు బస్సులో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న వెండిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుడి కాలువను పరిశీలించిన కేఆర్ఎంబీ సభ్యులు

విజయపురిసౌత్, ఏప్రిల్ 23: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) సభ్యుడు డీఈ అజయ్‌యాదవ్ మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని కుడికాలువను పరిశీలించారు. ముందుగా కుడికాలువ వద్ద అమర్చిన టెలీమీటర్‌ను, కాలువ ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఎంబీ జేఈ రాజేష్‌చారి, డీఈలు మురళీధర్, లింగమూర్తి, జేఈ బాబుమియా, ఏఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులు తుగ్లక్ పాలనకు నిదర్శనం

- 1589వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు, ఏప్రిల్23: రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి చరిత్ర హీనులుగా వైసీపీ పాలకులు మిగిలిపోయారని 33 వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అని రైతులు, మహిళలు, రైతుకూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1589వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఉన్న రాజధానిని నాశనం చేస్తూ మూడు రాజధానులు పెడతాను అని జగన్‌రెడ్డి అనటం తుగ్లక్ పాలనకు నిదర్శనమన్నారు. వైసీపీని ఇంటికి పంపటమే ధ్యేయంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి.

84,371 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 75,351 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 84,371 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,569 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	9500	12000
273	10500	13800
341	8000	17000
4884	9000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	13000
తెల్లకాయలు	4500	11500


అమరావతిలో భాష్యం ప్రవీణ్‌తో కలసి మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

వైసీపీకి ఓటెందుకు వెయ్యాలో నిలదీయండి

- మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, ఏప్రిల్ 23: ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన వైసీపీ నాయకులు మరోసారి ఓటు వేయాలని ఇంటికి వస్తే మీకు ఓటు ఎందుకు వేయాలని ప్రజలు నిలదీయాలని మాజీ మంత్రి మరియు సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో కలసి మండలంలోని అమరావతి, లింగాపురం, మల్లాది గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇసుక, మద్యం, గ్రావెల్, గ్రానైట్ అక్రమ తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్నాడని, సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.1000 వివిధ పన్నుల రూపంలో లాక్కున్నాడని అన్నారు. రాజధానిని నిర్మించలేని, పోలవరాన్ని పూర్తి చేయలేని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేని ఈ ప్రభుత్వానికి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ గతంలో 20 ఏళ్లు కన్నా లక్ష్మీనారాయణను ఆదరించారని, అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆదరించారని అదేవిధంగా తనను ఆశీర్వదించి ఆదరించాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమాల్లో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రేపు గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

- గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 25న జరగనున్న ఏపీఆర్‌జేసీ, డీసీసెట్ -2024, ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు వెల్లడించారు. మంగళవారం గుంటూరు కొరిటెపాడులోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ఏపీఆర్ఎస్ క్యాట్-2024కు 32,666 మంది విద్యార్థులకు 145 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 10 జూనియర్ కళాశాలలతో పాటు ఒక డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు జరగనున్న ఏపీఆర్జేసీ డీసీసెట్ -2024కు 56,949 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకోసం 254 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీలో ప్రవేశానికి 1,209మంది డీసీసెట్‌కు హాజరవుతున్నారన్నారు. 26 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, పరీక్షల నిర్వహణను ఆయా జిల్లాల్లో ఏపీఆర్ఈఐఎస్ ద్వారా నియమించిన కో-ఆర్డినేటర్లు, డీఈవోలు పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి డీఈవోలచే చీఫ్ సూపరింటెండెంట్, తమ సంస్థ ద్వారా శాఖాధికారులను నియమించామన్నారు. సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు కనీసం గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.


విద్యార్థులతో డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

'పది' ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ ప్రభంజనం

గుంటూరు(విద్య), ఏప్రిల్23: 10వతరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించారని సంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు 592 సాధించారని తెలిపారు. అదేవిధంగా 580 పైన 35 మంది. 570 పైన 96మంది, 560 పైన 155మంది, 550పైన 243 మంది, 540పైన 314 మంది, 530పైన 386 మంది, 520 పైన 450మంది. 510పైన 18మంది, 500 లోపు 600 మంది విద్యార్థులు విజయం సాధించారు. అదేవిధంగా మ్యాథ్స్‌లో 91 మందికి 100 మార్కులు, 225 మందికి 95 పైన మార్కులు వచ్చాయని వెల్లడించారు. తెలుగులో 32 మందికి 100 మార్కులపైన, 331 మందికి 95 మార్కులు సాధించారని వివరించారు. ఇంకా సోషల్ 24 మందికి 100 మార్కులు, 296 మందికి 95 పైన మార్కులు, సైన్స్‌లో 17 మందికి 100 మార్కులు 155 మందికి 95 పైగా మార్కులు, హిందీ 9 నుందికి 100 పైన 87మందికి 95 పైన మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం తదితరులు అభినందించారు.

మన వాళ్లయితే ఓకే..!

- పులిచింతల పునరావాసపట్టాల రిజిస్ట్రేషన్‌లో అధికారుల పక్షపాతం
- నెలన్నర అవుతున్నా చేతికందని పత్రాలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 23: పులిచింతల పునరావాస కేంద్రాల నిర్వాసితుల పట్టాలను ఉచితం ఉచితం అంటూనే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొందరు అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా తయారై ప్రతి లబ్ధిదారుడి వద్ద నుంచి సుమారు 3 వేల రూపాయలకు పైగా వసూలు చేశారు. మామూళ్ల వ్యవహారం కలెక్టర్ కార్యాలయానికి చేరడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను రెవెన్యూ కార్యాలయంలో పూర్తిచేసుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించాల్సి వుంది. అలా చేసినా వసూళ్ల మాత్రం ఆగలేదు సరికదా..ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అధికార పార్టీ నేతలు కొత్త ఎత్తుగడకు సిద్ధమయ్యారు. న్యూ వెల్లంపల్లి పునరావాస కేంద్రానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు మార్చి నెల 4, 5 తేదీల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల ప్రక్రియ పూర్తయినా పులిచింతల స్పెషల్ కలెక్టర్, ప్రత్యేక అధికారుల బయోమెట్రిక్ వేసిన తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు చూపారు. అలా దస్తావేజులను పూర్తిచేయడంలో కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులు ఒకటయ్యారు. మనవాళ్లైతే ఓకే.. కాకుంటే చూద్దాం అంటూ దస్తావేజులన్నీ పక్కన పెట్టారు. న్యూవెల్లంపల్లి పునరావాస కేంద్రంలో వైసీపీ నేతలు చెప్పిన వారి దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి పత్రాలను లబ్ధిదారులకు నాలుగు రోజులు అటో ఇటో ఇచ్చేశారు. టీడీపీ సానుభూతిపరులకు చెందిన కొన్ని రిజిస్ట్రేషన్ పత్రాలపై ఇంకా అధికారుల సంతకాలు పెట్టకపోవడం వెనుక నేతల ఒత్తిడి కారణమని, ఇప్పటికీ నెలన్నర అవుతున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులను ఇవ్వకుండా ఎన్నికల డ్రామా ఆడటం పట్ల నిర్వాసితులు మండిపడుతున్నారు. దీని వెనుక నేతల ఒత్తిడి కారణమని, ఒకటి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులను వెంటనే ఇవ్వకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు నిర్వాసితులు సంసిద్ధంగా వున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి


లావణ్య (ఫైల్)

పెదకాకాని, ఏప్రిల్ 23: గుర్తుతెలియని మహిళ మృతి చెంది నట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న గుంటూరు- పెదకాకాని హైవేపై గుర్తు లేని మహిళపడి ఉంది. 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా ఆమె పేరు లావణ్య అని మాత్రమే చెప్పిందని పోలీసులు తెలిపారు. మతి స్థిమితం లేని ఆ మహిళ ఈనెల 17న మృతి చెందినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో 8688831350 తెలియపరచాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పారిశ్రామికంగా బాపట్లను అభివృద్ధి చేస్తా

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి
- కూటమి ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్ నామినేషన్ దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 23 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థిగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు నామినేషన్ దాఖలు చేసిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలీసు అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశానన్నారు. 35 సంవత్సరాలు పాటు భారతదేశానికి సేవలందించిన తాను ప్రతిదినం ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ముందుకెళుతున్నానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐపీఎస్ అధికారిగా పని చేసిన తాను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని చెప్పారు. గుంటూరులో రౌడీయిజం అణిచివేయటానికి చంద్రబాబు తనను ఎస్పీగా పంపారని 6 నెలల్లో దానిని తీసివేశానని చెప్పారు. నాటి చరిత్రను తిరగరాస్తానని బాపట్లను అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. నిజాంపట్నంలో పోర్ట్, ఓడరేవులో ఫిషింగ్ హార్బర్, చీరాలలో మెగా టెక్స్‌టైల్‌పార్క్, సంతనూతలపాడు-అద్దంకి మధ్య గ్రానైట్ ఇండస్ట్రీకి క్లస్టర్ కట్టిస్తానని చెప్పారు. ఐటి హబ్ ఏర్పాటు చేయటంతోపాటు చీరాల-బాపట్లలో టూరిజం ప్రాజెక్ట్‌లు తీసుకొచ్చి లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. యువత డాలర్ల కోసం ఇతర దేశాలకు వెళ్ళకుండా ఇక్కడ అంత మొత్తం సంపాదించుకునే విధంగా ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, న్యాయవాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వేగేశన పూజలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 23 : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు వారికి ప్రత్యేక పూజలునిర్వహించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. కూటమిశ్రేణులతో కలిసి అల్లూరు, అలకాపురం, ఖాజీపాలెం, జీఎన్‌పాలెం, పిట్టలవానిపాలెం, కొత్తపాలెం రహదారి నుంచి చందోలు, రెడ్డిపాలెం గ్రామాల మీద బయలుదేరి నామినేషన్ కార్యక్రమానికి బాపట్ల తరలివచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూటమి నాయకులు, తెలుగుమహిళలు, కార్యకర్తలు, అభిమానులు సుమారు 5 వేల మందికిపైగా పిట్టలవానిపాలెం మండలం నుంచి బాపట్లకు తరలివెళ్ళారు. నరేంద్రవర్మకు ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది.



కార్యకర్తలు, నాయకులతో కలిసి ద్విచక్రవాహనంపై ర్యాలీగా వస్తున్న వేగేశన నరేంద్రవర్మ

నరేంద్రవర్మకు కర్లపాలెంలో ఘన స్వాగతం

కర్లపాలెం, ఏప్రిల్ 23 : బాపట్ల నియోజకవర్గ జనసేన,బీజేపీ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ నామినేషన్‌కు కర్లపాలెం మండల నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు పసుపుదండుగా కదం తొక్కుతూ నరేంద్రవర్మ నామినేషన్‌కు మద్దతు పలికారు. మండలం నలుమూలల నుంచి వందలాది ద్విచక్రవాహనాలతో కర్లపాలెం వీధులలో పసుపు దండు భారీ ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని యాజలి నుంచి సత్యవతిపేట వరకు జాతీయ రహదారికి ఇరువైపుల వేలాది మంది ప్రజలు బారులు తీరి పసుపుజెండాలు చేతబూని నరేంద్రవర్మకు స్వాగతం పలుకుతూ మద్దతునిచ్చారు. కర్లపాలెం సెంటర్‌లో టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పఠాన్ అహ్మద్‌బాషా, ఎమ్మెల్యే బాషా, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, పిట్ల వసంతరెడ్డి, బీసాబత్తిన గోపి, మాడా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందలాది ద్విచక్రవాహనాలతో టీడీపీ శ్రేణులు నరేంద్రవర్మ నామినేషన్‌కు బాపట్ల తరలి వెళ్ళారు. నరేంద్రవర్మకు నల్లమోతువారిపాలెంలో బీసాబత్తిన గోపి క్రేన్ సాయంతో నరేంద్రవర్మకు గజమాల వేశారు.



నరేంద్రవర్మకు క్రేన్ సాయంతో గజమాల వేస్తున్న నల్లమోతువారిపాలెం గ్రామస్థులు

వలంటీర్ రాజీనామా.. వైసీపీ రెబల్‌గా పోటీ

- ఎంపీ సురేష్ అక్రమాలపై ధ్వజమెత్తి ఆయనపైనే బరిలో

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పీజీ ఎంఏ పొలిటికల్ సైన్స్ చేసి వలంటీర్‌గా పని చేసిన ఓ యువకుడు వైసీపీ రెబల్‌గా బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. చీరాలకు చెందిన కట్టా ఆనంద్‌బాబు వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్‌గా ఎంపికై ఇంతకాలం పని చేశారు. అయితే ఆయన మంగళవారం తన వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం ఆనంద్‌బాబు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. బాపట్ల వైసీపీ లోక్‌సభ స్థానం నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నట్లు ప్రకటించారు. తాడేపల్లిలో అరిటాకులు అమ్ముకుని బతికే సామాన్య వ్యక్తి ఈ రోజు లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడంటూ వైసీపీ ఎంపీ సురేష్‌పై ధ్వజమెత్తారు. బాపట్ల ఎంపీగా గెలిచి ఒక్కసారి కూడా బాపట్ల రాని వ్యక్తి సురేష్ అన్నారు. సురేష్ మీద వ్యతిరేకతతోనే తాను వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఆయనపైనే పోటీకి దిగినట్లు చెప్పారు.

ఎస్ఐ నాగ శివారెడ్డికి షోకాజ్ నోటీసు

బాపట్ల,ఏప్రిల్ 23 : పర్చూరు తహసీల్దార్ కార్యాలయం మెయిన్‌గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగ శివారెడ్డి తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను అసభ్యకర పదజాలంతో దూషించాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయానికి నాగశివారెడ్డిని పిలిపించి సదరు విషయంపై వివరణ కోరారు. అనంతరం ఎస్ఐకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ఘటనపై ప్రత్యేక విచారణాధికారిగా బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను నియమించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న నాగశివారెడ్డిని అన్నంభొట్లవారిపాలెం చెక్‌పోస్టు విధులకు పంపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేమూరు, ఏప్రిల్ 23 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వేమూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన కొల్లి పున్నారావు (58)కిరాణా సరుకులు నిమిత్తం వేమూరు వచ్చి పెట్రోల్ బంకులో బండికి ఆయిల్ కొట్టించుకుని సెంటర్‌కి వస్తున్న సందర్భంలో తెనాలి వైపు నుంచి వస్తున్న కారు పున్నారావును ఢీకొట్టింది. 108 ద్వారా వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పున్నారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆశీర్వదించి గెలిపించండి.. ప్రజలకు మంచి పాలనందిస్తా

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



నామినేషన్‌కు బయలుదేరుతున్న నరేంద్రవర్మకు ఇంటి వద్ద హారతులు పడుతున్న మహిళ

బాపట్ల, ఏప్రిల్ 23 : ప్రజలంతా ఆశీర్వదించి గెలిపిస్తే మంచి పాలన అందిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ హామీనిచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పదవి అంటే పెత్తనం కాదు బాధ్యతగా భావించి పని చేస్తానన్నారు. ఇప్పటికే ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్న తాను ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సేవకునిగా పని చేస్తానన్నారు. అల్లూరు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు, చందోలు బండ్లమ్మతల్లి దయ, బా



పార్టీశ్రేణులతో కలిసి రోడ్డుషోలో పాల్గొన్న వేగేశన నరేంద్రవర్మ

పట్ల భావన్నారాయణస్వామి దీవెనలతో నామినేషన్ దాఖలు చేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసికట్టుగా పని చేసి గెలిపించాలనే ఉత్సాహంతో రోడ్‌షోకు తరలిరావటం సంతోషదాయకమన్నారు. పల్లెలు, వాడవాడలా ప్రజలు వేసవి తీవ్రతను సైతం లెక్కచేయకుండా అభిమానం చాటుకోవటం ఆనందదాయకమన్నారు. నాలుగు పర్యాయాలుగా బాపట్లలో ఓటమి పాలవుతున్న తెలుగుదేశం జెండా బాపట్ల గడ్డపై ఈసారి ఎగురవేస్తామన్నారు. ప్రజలు మార్పునకు శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. దుర్మార్గపు ప్రభుత్వం, అవినీతి ఎమ్మెల్యేను తరిమి కొట్టాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. బాపట్ల ఎమ్మెల్యే సొంత జాగీరుగా వ్యవహరిస్తున్నారని ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. కూటమి అధికారంలోకి రావటం



ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతానన్నారు. గతంలో అన్నంసతీష్ ప్రభాకర్ చేసిన విధంగా తాను ప్రజలకు మంచి సేవ చేస్తానన్నారు. వ్యాపారస్తులు స్వతంత్రులుగా పని చేసుకోవచ్చు అన్నారు. స్వేచ్ఛగా పౌరులంతా తమ పాలనలో జీవించే విధంగా పని చేస్తామన్నారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

గెలుపు కోసం పట్టుదలతో పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

కూటమిఅభ్యర్థుల విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీశ్రేణులంతా పట్టుదలతో, కసితో పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నా



రోడ్డుషోలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ

యకులు అన్నం సతీష్ ప్రభాకర్ కోరారు. నరేంద్రవర్మ నామినేషన్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమన్నారు. మంచి సాంప్రదాయంగా అల్లూరు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు తీసుకొని 25 కిలోమీటర్లకు పైగా రోడ్‌షో నిర్వహించి నామినేషన్ వేయటానికి రావటం సంతోషదాయకమన్నారు. ఉదయం 7 గంటలకు బయలుదేరిన రోడ్‌షోకు దారి పొడవున వేలాదిమంది కార్యకర్తలు స్వాగతం పలుకుతూ కేరింతలుకొడుతూ పండుగ వాతావరణం సృష్టించారన్నారు. గత చేదు అనుభవాలను అధిగమించి ప్రజలు టీడీపీని గెలిపించి తీరుతారన్నారు. అనేక సమస్యలు సృష్టించి ప్రలోభాలకు గురి చేసే వారికి లొంగక పార్టీ కోసం నిలబడి పని చేయాలని ఆయన కోరారు.



రోడ్డుషోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు

సూపర్-6 పథకాలే కూటమి అభ్యర్థులను గెలిపిస్తాయి

- మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్

భట్టిప్రోలు, ఏప్రిల్ 23: అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా సూపర్-6 పథకాలను రూపొందించారని ఆ పథకాలే కూటమి అభ్యర్థులను గెలిపిస్తాయని మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేష్ అన్నారు. మండలంలోని పెదలంక, పెసర్లంక గ్రామాల్లో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచా రంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తన తండ్రి నక్కా ఆనందబాబు మంత్రిగా పని చేసిన కాలంలో ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. ఉమ్మడి కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని ఓటర్లను కోరారు. దారి పొడవునా అఖిలేశ్‌కు అభిమానులు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు వేములపల్లి జగన్నాధరావు, బోరుగడ్డ వెంకటస్వామి, వేములపల్లి శివకుమార్, వేములపల్లి కమలాకరరావు, వేములపల్లి రత్నగోపాల్, జల్లి సుబ్బారావు, పులివర్తి రాఘవరావు పాల్గొన్నారు.



సూపర్-6 పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్

ఘనంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 23 : మండలంలోని జీఎన్‌పాలెం గ్రామంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి కల్యాణమహోత్సవం మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. సకల శాంతిని కాంక్షిస్తూ ఆలయ నిర్వాహకులు, ఆలయ అర్చకులు బృందావనం గోపి చంద్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

బాలబాలికలు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

బాపట్లరూరల్, ఏప్రిల్ 23 : ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి బాలబాలికలు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా మంగళవారం వెదుళ్ళపల్లిలోని ఎంపీపీ పాఠశాలలో బాలబాలికల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏ.సరోజ, డి.శివపార్వతి పాల్గొన్నారు.

16 మంది వలంటీర్ల రాజీనామా

వేమూరు, ఏప్రిల్ 23 : మండలంలోని కుచ్చెళ్ళపాడు, వరహాపురం, వేమూరు గ్రామాల పరిధిలోని 16మంది మంగళవారం రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

ఎంపీ అభ్యర్థులుగా నలుగురు..

ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్

బాపట్ల, ఏప్రిల్ 23 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ అభ్యర్థులుగా మంగళవారం నలుగురు నామినేషన్‌లు దాఖలు చేశారు. తెలుగుదేశం అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థిగా జేడీ శీలం, స్వతంత్ర అభ్యర్థులుగా కట్టా ఆనందబాబు, దేవరపల్లి పాపారావు నామినేషన్ పత్రాలు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషాకు అందజేశారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మ రెండుసెట్‌లు నామినేషన్‌లు వేయగా, విముక్తి చిరుతుల కక్షి పార్టీ అభ్యర్థిగా రేగులగడ్డ చంద్రశేఖరరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పఠాన్ మహబూబ్ ఖాన్‌లు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌కు అందజేశారు.

రేపల్లెలో ఐదు నామినేషన్లు

రేపల్లె, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇండిపెండెంట్ అభ్యర్థిగా అరవపల్లి పంచాయతీ దళితకాలనీకి చెందిన బొడ్డు నాగేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా రాజా రామరాజు ఒక్కటి నామినేషన్ అందించారని, బారత చైతన్య విభజన పార్టీ అభ్యర్థిగా అంగిరేకుల ఆదినారాయణ, ఇండియన్ ప్రజాబందు పార్టీ తరపున మెరుగుపాల సదా శివరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బొర్రా శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

నేడు వైఎస్ షర్మిల రేపల్లె రాక

రేపల్లె, ఏప్రిల్ 23: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉదయం 11గంటల సమయం లో బస్టాండ్‌సెంటర్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరా వు తెలిపారు. అనంతరం 1గంటకు సభ ముగించుకుని కృష్ణా జిల్లా పామర్రు, పెడనలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల

కొల్లూరు, ఏప్రిల్ 23: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని అనంతవరం, క్రాప గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీరు సదుపాయాలు కూలీలకు కల్పించాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి కూలీ దినసరి వేతనం రూ.600 పెంచాలన్నారు. కూలీలందరికి అవసరమైన పనిముట్లు అందజేయాలన్నారు. రెండు పూటల పని పద్ధతి రద్దు చేసి వేసవిని దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో పని ముగిసేలా ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, మేట్‌లు కారుమంచి సుభద్ర, షైలా మునలయ్య, అనురాధ, సుజాత, బుల్లిబాబు పాల్గొన్నారు.



రాజుకాల్వ వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

రాష్ట్రాభివృద్ధి కోసమే ఎన్‌డీఏ కూటమి

- పార్టీ కోసం పని చేయండి.. అండగా ఉంటా
- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 23: రాష్ట్రాభివృద్ధి భావితరాల భవిష్యత్తు కోసమే ఎన్‌డీఏ కూటమిగా ఏర్పడిందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజుకాల్వ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బండ్రెడ్డి నాగబసవయ్య, బండ్రెడ్డి శ్రీనివాసరావు, లక్ష్మీకాంతారావు, బాలకృష్ణ, బండ్రెడ్డి నాగమోహన్‌లు 50 కుటుంబాల వారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 17వవార్డులోని ఇసుకపల్లి చేనే త సొసైటీ అధ్యక్షుడు, వైసీపీ నాయకులు కౌతవరపు వెంకట నాంచారావు, పాలకవర్గ సభ్యులకు అనగాని సత్యప్రసాద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20రోజులు పార్టీ కోసం కష్టపడి పనిచెయ్యండి మీకు అం డగా ఉంటానని తెలిపారు. పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి సమష్టి కృషితో నియోజకవర్గాన్ని అభి వృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కొపనాతి రాజశేఖర్, రేపల్లె రామాంజనేయులు, యరగళ్ళ వీరయ్య, గూడపాటి శ్రీనివాసరావు, గోగినేని పట్టాభిరామారావు, ముత్తవరపు తేజ్‌కుమార్, అడిగోపుల వీరశంకర్, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకపల్లి చేనేత సొసైటీ పాలకవర్గ సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

నేడు అనగాని సత్యప్రసాద్ నామినేషన్

రేపల్లె, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ బుధవారం ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. 9గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి రాజ్యలక్ష్మి థియేటర్ నుంచి టీడీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు, టీడీపీ నాయకులతో కలుసుకుని ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు మాట్లాడుతూ అనగాని నామినేషన్‌కు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు లంక గ్రామాల్లో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, ఏప్రిల్ 23 : టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బుధవారం సాయంత్రం లంక గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని చిలుమూరులంక గ్రామంలో బుధవారం సాయంత్రం 4గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని అక్కడి నుంచి సుగ్గునలంక, ఈపూరులంక, చిం తల్లంక, పెదలంక, పెసర్లంక గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహిస్తారన్నారు. ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీ పీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

25న పెదపులివర్రులో..

భట్టిప్రోలు, ఏప్రిల్ 23 : ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మం డలంలోని పెదపులివర్రు పంచాయతీ లో జరిగే ప్రచారంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొంటారని మండల కన్వీనర్ వాకా శేషుబాబు తెలియజేశారు. గురువారం సా యం త్రం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెంలో ప్రచారం ప్రారంభమై జిలుగువారిపాలెం, అక్కివారిపాలెం, గుత్తావారిపాలెం, గాజులపేట, కోళ్ళపాలెం, పెదపులివర్రులో ముగుస్తుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శేషుబాబు కోరారు.

పదిలో బీసీ హాస్టల్ విద్యార్థి అవినాష్ ప్రతిభ

భట్టిప్రోలు, ఏప్రిల్ 23: పదో తరగతి పరీక్షల్లో స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక బీసీ హాస్టల్‌లో ఉం టూ టీఎంరావ్ హైస్కూల్లో చదువుచున్న గుడిమెట్ల అవినాష్ ఉత్తమ ప్రతిభ సాధించినట్లు హాస్టల్ వార్డెన్ ఎంవీ సుబ్బారావు తెలియజేశారు. జిల్లాలో ఉన్న బీసీ హాస్టళ్ళలో అవినాష్ మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. స్థానిక బీసీ హాస్టల్ నుంచి నలు గురు విద్యార్థులు పరీక్షలకు హాజరు అందరూ ఉత్తమ ప్రతిభ సాధించారన్నారు. బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి అరుణమ్మ, టీఎంరావ్ హైస్కూలు హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావులు విద్యార్థులను, వసతి గృహ సంక్షేమ అధికారులను అభినందించారు.



జిల్లా రాజకీయాల్లో తారాతోరణం

- కొంతమంది ఇక్కడి నుంచే గెలుపు, ఓటములు
- మరికొందరు ఇతర ప్రాంతాల్లో విజయకేతనం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సినీనటులు రాజకీయాల్లో ప్రవేశించడం కొంగర జగ్గయ్యతో ప్రారంభమైంది. సీనియర్ కమ్యూనిస్టు నేత మాదాల నారాయణ స్వామిని ఓడించడానికి అప్పట్లో కాంగ్రెస్ జగ్గయ్యను బరిలోకి దించింది. దుగ్గిరాల ప్రాంతానికి చెందిన జగ్గయ్య సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంపీగా పోటీ చేసి నారాయణ స్వామిని ఓడించారు. ఈ పరిణామం అప్పట్లో సంచలనమైంది. ఆ తర్వాత సినీ తారల చూపు రాజకీయాల వైపు కూడా మళ్లింది. అయితే వారిలో చాలామంది రాజకీయ తెరంగేట్రం చేయడం, కొద్దికాలం తర్వాత దూరమైపోవడం జరిగింది.

- సినీ నిర్మాత డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు 1999లో గుంటూరు జిల్లా బాపట్ల లోక్‌సభ నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. జన్మభూమి పథకం ద్వారా ఆయన తన సొంత నిధులను మ్యాచింగ్ గ్రాంట్‌గా వెచ్చించి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. బాపట్ల నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా రామానాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు మనకు కనిపిస్తుంటాయి. అయినా 2004 ఎన్నికల్లో రామానాయుడు ఓడిపోయారు. అప్పటి నుంచి ఆయన రాజకీయాలకు దూరమయ్యారు.
- గుంటూరు జిల్లా బుర్రిపాలెం గ్రామానికి చెందిన సినీనటుడు కృష్ణ 1989లో ఏలూరు ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బోళ్ల బుల్లిరామయ్యను ఓడించిన కృష్ణ 1991లో అదే బులిరామయ్యపై ఓడిపోయారు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉండి గత ఏడాది కన్నుమూశారు.
- సినీనటి ఊర్వశి శారద 1996లో టీడీపీ అభ్యర్థిగా తెనాలి నుంచి ఎంపీగా గెలుపొందారు. 1998లో తెనాలి పార్లమెంట్‌లోనే ఓడిపోయారు. 1999లో నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- నటి జమున 1985లో గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. 1989లో కాకినాడలో కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసి గెలుపొందారు. 1991లో ఓడిపోయారు. తరువాత కొన్నాళ్లు బీజేపీలో కొనసాగారు. ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

శభాష్.. నాగిరెడ్డి

- ఇండిపెండెంట్‌గా నిలిచి.. గెలిచిన జూలకంటి నాగిరెడ్డి
- అభినందించిన పీవీ నరసింహారావు



మాచర్లటౌన్, ఏప్రిల్ 21: మాచర్ల అంటే రసవత్తర రాజకీయాలకు పేరుగాంచిన నియోజకవర్గం.. ఇక్కడ పార్టీలు మారడం అంటే చాలా తేలిక. ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేం. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి కోవర్టుగా వ్యవహరిస్తుంటారు. అధికారంలో వున్నంతకాలం పనులు చక్కబెట్టుకోవడం పార్టీ ఓడిపోతుందనుకుంటే చొక్కాలు మార్చినట్లు పార్టీలు మార్చడం ఇక్కడ రివాజుగా మారింది. ఇక్కడ పార్టీ గుర్తు మీద గెలవడమంటేనే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అటువంటిది ఇండిపెండెంట్‌గా గెలిచారంటే సామాన్యమైన విషయం కాదు. ఆ కుటుంబానికి ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతులుండడం, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉండడమే. అటువంటి కోవకు చెందినదే జూలకంటి నాగిరెడ్డి కుటుంబం అనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. 1967లో నాగిరెడ్డి ఇండిపెండెంట్‌గా పువ్వు గుర్తుపై పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వెన్నా లింగారెడ్డిపై 72 ఓట్లతో ఓడారు. మళ్లీ 1972లో పులిగుర్తుపై పోటీచేసి లింగారెడ్డిపై 11,169 మెజార్టీతో గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. అప్పుడు అసెంబ్లీ స్పీకర్‌గా వున్న పిడతల రంగారెడ్డి చాంబర్‌కు వెళ్లిన నాగిరెడ్డి సీఎం పీవీ నరసింహారావుకు నమస్కారం చేశారు. అప్పుడు పీవీ ఇండిపెండెంట్‌గా గెలిచింది మీరేనా.. నీవు మాములోడివి కాదయ్యా.. మా కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా బంపర్ సీట్లు వస్తే నీవు గెలవడం రికార్డు అని నాగిరెడ్డి భుజాల మీద చేతులు వేసి పీవీ శభాష్ అని ప్రశంసించినట్లు రెంటచింతల మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి(17 సంవత్సరాలు సర్పంచ్) గుర్తు చేశారు. సార్ సార్ 1967లో పోటీ చేసినప్పుడు కౌంటింగ్ సమయంలో కరెంట్ నిలిపి వేశారని అందుకనే తక్కువ మార్జిన్‌తో ఓడిపోయాయని గుర్తు చేయగా పీవీ పెద్దగా నవ్వి తమ ప్రభుత్వ తప్పిదం గురించి ఏమి మాట్లాడలేకపోయారు. ప్రస్తుతం బరిలో ఉంది ఆయన కుమారుడే బ్రహ్మారెడ్డి. తల్లిదండ్రులు మూడుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసినా బ్రహ్మారెడ్డి కుటుంబానిది సాధారణ జీవితమే.

టీడీపీ, జనసేన ప్రచారంలో ఏటీవీ బైక్‌లు

- ఆకట్టుకుంటున్న వినూత్న విధానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 : లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు కొత్త పంథా అనుసరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఏటీవీ బైక్‌లు వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతానికి ఇవి కొత్త కావడంతో పలువురిని ఆకట్టుకుంటున్నాయి. తెనాలి నియోజకవర్గంలో అభ్యర్థులు ఐదు బైక్‌లను ఏర్పాటుచేసి వాటికి జెండాలు కట్టి తిప్పుతున్నారు. బీచ్‌లు, ఘాట్ ఏరియాలు, ఇసుక ప్రదేశాలలో విరివిగా వాడే ఈ బైక్‌లు ఈ ప్రాంతానికి ఇంతవరకు పరిచయం కాలేదు. టీడీపీ, జనసేన జెండాలతో తిరుగుతున్న బైక్‌లను చూసి వీటిని తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పనిలోపనిగా తమ పార్టీ జెండాలు జనం చూస్తుండటంతో ప్రచారానికి ఉపయోగపడుతుందని పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రచారంలో వినియోగిస్తున్న వినూత్న బైక్‌లు



రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం వద్ద వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన బారికేడ్లు

నామినేషన్.. తీసుకోం..

టైంకి రాలేదు మరి..

- అంబటి మురళీకృష్ణ నామినేషన్‌కు ఆదిలోనే హంసపాదు
- సమయం దాటిపోవటంతో నామినేషన్ నిరాకరణ
- నిరుత్సాహంతో వెనుతిరిగిన వైసీపీ శ్రేణులు



ఐలాండ్ సెంటర్‌లో అంబటి మురళీ నామినేషన్ సభ జనం లేక వెలవెల


పొన్నూరుటౌన్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పొన్నూరు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేయటానికి ఆర్భాటంగా ఏర్పాట్లు చేశారు. అయితే ఆయనకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. హంగు ఆర్భాటాలతో నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ కార్యాలయానికి సకాలంలో చేరుకోకపోవటంతో నామినేషన్‌ను స్వీకరించేందుకు అధికారులు అంగీకరించలేదు. 3 గంటల లోపు వస్తేనే నామినేషన్లు స్వీకరిస్తామని లేదంటే కుదరదని రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.లక్ష్మీకుమారి తేల్చిచెప్పారు. దీంతో వైసీపీ శ్రేణులు ఏం చేయాలో పాలుపోక కేవలం ప్రసంగాలతోనే సరిపెట్టుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అడుగడుగునా.. ఉల్లంఘన

నామినేషన్ దాఖలు సందర్భంగా 100 మీటర్లలోపు నిషేదాజ్ఞలు అమలు చేశారు. ఆ పరిధి దాటిన తర్వాత కేవలం 20 మీటర్ల వ్యవధిలో వైసీపీ కార్యాలయం వద్ద భారీగా టెంట్లలోకార్యకర్తలకు మాంసంతో వంటకాలు వండించి భోజన ఏర్పాట్లను చేశారు. పురుషులకైతే రూ.200 నగదు, క్వార్టర్ మద్యం బాటిల్, రూ.100 పెట్రోల్ కూపన్, బిర్యాని అందచేశారు. మహిళలకు రూ.500 నగదు, బిర్యాని ఏర్పాటు చేశారు. నాగేంద్ర స్వామి పుట్టఎదురుగా ఎటువంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున వంటలు వండించారు. అలాగే ఆర్వో కార్యాలయం వద్ద బారికేడ్లను సైతం వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశారు. నిషేదాజ్ఞలను సైతం ఉల్లంఘించి కార్యాలయం మీదుగా రాకపోకలు సాగించారు. కార్యాలయం వద్ద వాహనాలను అడ్డంపెట్టి ట్రాఫిక్‌కు అవరోధాలు కల్పించారు. అంతా చేసినప్పటికి నామినేషన్ కార్యక్రమానికి జనం రాకపోవటంతో వైసిపి శ్రేణులే డీలా పడ్డారు.

వేమూరు.. వకీళ్లు

- లాయర్లకు కలిసొచ్చిన వేమూరు నియోజకవర్గం
- ఒకరు ముఖ్యమంత్రిగా, ఐదుగురు క్యాబినెట్ మంత్రులుగా...



ఎడ్లపాటి వెంకట్రావు
నక్కా ఆనందబాబు
నాదెండ్ల భాస్కరరావు
కల్లూరి చంద్రమౌళి
ఆలపాటి రాజేంద్రప్రసాద్
ఆలపాటి ధర్మరావు

వేమూరు, ఏప్రిల్ 23: వేమూరు అసెంబ్లీ స్థానం లాయర్లకు ఎంతగానో కలిసి వచ్చింది. 1955నుండి ఇంతవరకు 15సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1965లో ఉప ఎన్నికల జరిగింది. పది మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీపడి విజయాన్ని సాధించారు. వీరిలో ఆరుగురు న్యాయవాద వృత్తిలో ప్రావీణ్యం సాధించారు. వారిలో ఒకరు ముఖ్యమంత్రిగా, ఐదుగురు క్యాబినెట్ మంత్రులుగా పనిచేశారు. 1955లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీపడి తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కల్లూరి చంద్రమౌళి, 1962 ఎన్నికల్లో కూడా విజయం సాధించారు. ఆయన దేవాదాయ శాఖ మంత్రిగా, రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1967, 1972 ఎన్ని కల్లో స్వతం త్ర పార్టీ అభ్యర్థిగా, 1978లో కాంగ్రెస్ (ఐ)పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయన మర్రి చెన్నారెడ్డి మంత్రి వర్గంలో ప్రణాళిక న్యాయశాఖ మంత్రిగా వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడ్డ నాదెండ్ల భాస్కరరావు విజయం సాధించి నెల రోజుల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. 1989ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆలపాటి ధర్మరావు శాసనసభ ఉపసభాపతిగా, రవాణా, న్యాయ, ఉన్నత విద్య హోంశాఖల మంత్రిగా పనిచేశారు. 1994-1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ 1999 నుంచి 2001వరకు చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2009-2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించిన నక్కా ఆనందబాబు 2017నుంచి 2019 వరకు చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఈ విధంగా వేమూరు సెగ్మెంట్ న్యాయవాదులకు కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 23: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ శాఖల ఉద్యోగులతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, విశ్రాంత ఉద్యోగులంతా వారు పని చేసే ప్రాంతాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా మాత్రమే పోస్టల్ బ్యాలెట్ సదుపాయాలను ఉపయోగించుకోవాలన్నారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

ఎస్పీ వకుల్ జిందాల్

ఎస్ఎస్‌టీ బృందాలు సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయం నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బృంద సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు ఎస్ఎస్‌టీ బృందాలు నిర్వహించే విధులు కీలకమన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా తరలించే మద్యం, నగదు, ఇతర వస్తువుల రవాణాను కట్టడి చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ మొత్తంలో నగదు రవాణా చేస్తున్నా, రూ.10 వేల కన్నా ఎక్కువ విలువ చేసే ప్రచార సామగ్రి తరలిస్తున్నా సీజ్ చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, సి.హెచ్. సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై దమనకాండ

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు



పిడుగురాళ్ల గాంధీనగర్‌లో మాల సామాజికవర్గ నేతలతో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 23 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎందరో దళితులపై దాడులు, హత్యాయత్నాలు, మహిళలపై అత్యాచారాలతో పాటు దమనకాండ జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. మంగళవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని గాంధీనగర్‌లో మాల సామాజికవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దమనకాండ పూర్తిగా తొలగిపోవాలన్నా, సంక్షేమ పథకాలు అర్హులకు అందాలన్నా టీడీపీ పాలనతోనే సాధ్యమవుతుందన్నారు. మాస్క్ అడిగిన పాపానికి విశాఖలో డాక్టర్ సుధాకర్‌ను తీవ్రంగా హింసించి మరణానికి కారణమయ్యారని, దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేయడం, న్యాయం కావాలని వేడుకున్న మరికొందరు నేతలకు శిరోముండనం చేసిన ఘటనలన్నీ వైసీపీ పాలనలోనే జరిగాయన్నారు. ఇలాంటి దమనకాండ, అన్యాయాలు మరలా జరుగకుండా వుండాలంటే మాల సామాజికవర్గ నేతలందరూ టీడీపీ, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను బలపరిచి వైసీపీ నేతలకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పలువురు మాల సామాజికవర్గ నేతలు తదితరులు పాల్గొన్నారు.

21 నామినేషన్ల దాఖలు

బాపట్ల లోక్‌సభకు 4, అసెంబ్లీలకు 17

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బాపట్ల లోక్‌సభ స్థానానికి, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు మంగళవారం మొత్తం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. లోక్‌సభ స్థానానికి 4, అసెంబ్లీలకు 17 నామినేషన్లు వచ్చాయి. రేపల్లెకు 5 నామినేషన్లు రాగా, బాపట్లకు ముగ్గురు నాలుగు సెట్లు, పర్చూరులో 3, అద్దంకిలో 1, చీరాలలో 4 నామినేషన్లను ఆయా అభ్యర్థులు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

పన్నుపై.. ప్రజాగ్రహం

- 15 శాతం పన్ను పెంపుతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- దీంతో మూగబోయిన ఆస్తిపన్ను చెల్లించమని ప్రచారం చేసే వాహనాలు
- వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు





గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో ఈ నెలంతా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆస్తిపన్ను చెల్లింపు ప్రచార వాహనాలు గత రెండు, మూడు రోజుల నుంచి మూగబోయాయి. అంతకుముందు వరకు ఆస్తి పన్ను రెండు అర్థ సంవత్సరాలు కలిపి ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రిబేటు ఉంటుంది. ఆ తర్వాత నుంచి వడ్డీ భారం పడుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తూ పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు ఈ వాహనాల ద్వారా మునిసిపల్ అధికారులు ప్రయత్నించారు. అలానే వార్డు సచివాలయాల సెక్రెటరీలు వాట్సాప్ గ్రూపులు, ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేస్తూ ఈ నెలాఖరు వరకు ఉన్న ఐదు శాతం రిబేటుపై అవగాహన కల్పిస్తూ వచ్చారు. అయితే హఠాత్తుగా పైనుంచి ఆదేశాలు రావడంతో ప్రస్తుతం అంతా మిన్నకుండిపోయారు.

గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా ఏటా 15 శాతం ఆస్తి పన్ను ఆటోమేటిక్‌గా పెరిగే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈ విధానం అమలులో ఉంది. అయితే ఆ నగరం మెట్రోపాలిటన్ స్థాయిలో ఉన్నది. అంతేకాకుండా అక్కడ సౌకర్యాలకు, ఇక్కడికి నక్కకి నాగ లోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉంటుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌ప్రకాష్ సూచనలతో ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావడంతో ఏటా పన్ను పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15 శాతం పెరిగింది. గత ఏడాది గుంటూరు నగరంలో కేవలం 59 చదరపు గజాల్లో అసెస్‌మెంట్ నెంబరు. 1021107871లో ఉన్న భవనానికి రూ.2208 ఉండగా అది ఈ ఏప్రిల్ నెల నుంచి రూ.2,525కి చేరింది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఏకంగా రూ.317 ఆస్తిపన్ను అర్థ సంవత్సరానికే పెరిగింది. మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అసెస్‌మెంట్ నెంబరు. 1023015025లో ఉన్న ఆస్తిపై గత ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలకు రూ. 2,794 ఉండగా అది నేడు రూ.2,850కి పెరిగింది. పొన్నూరులో అసెస్‌మెంట్ నెంబరు. 1025006854లో ఉన్న ఆస్తిపై గత అర్థ సంవ్సరంలో రూ.2406 ఉండగా అది నేడు రూ.2,619కి పెరిగింది. తెనాలిలో అసెస్‌మెంట్ నెంబరు. 1028025075లో ఉన్న ఆస్తిపై గత అర్థ సంవత్సరంలో రూ.14,909 ఉంటే ఇప్పుడు అది రూ.15,207కి పెరిగింది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

ఆస్తిపన్నుపై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా 15 శాతం పెంచుకొంటూ పోతుండటంపై పట్టణ, నగర ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. దీని వలన ఆరు నుంచి ఏడు సంవత్సరాల్లోనే ఆస్తి పన్ను 100 శాతం పెరిగిపోతుంది. కాగా ప్రస్తుతం గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉండటాన్ని గమనించిన వైసీపీ అభ్యర్థులు మునిసిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పన్ను చెల్లించమని ఒత్తిడి చేయొద్దని ఆదేశాలు జారీ చేశారు. వాటిని అధికారులు యథాతథంగా పాటిస్తూ మైకులతో హోరెత్తించే వాహనాలను నిలిపేశారు.

15 వ ఆర్థిక సంఘం నిధుల విడుదలపై చర్యలు తీసుకోండి

- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23: పంచాయతీ లకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించించినట్లు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తమను ఇబ్బంది పెడుతున్న దని ఎన్నికల కమిషనర్ కు తాము ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడినట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో తాగటానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీల ద్వారా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చెయ్యటానికి చేతిలో చిల్లిగవ్వ లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర మేల్కొని నిధులు విడుదల చేయాలని జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

- అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి
- కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి పిలుపు



ద్రోణాదులలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి... మార్టూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 23 : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మంగళ వారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పర్యటించారు. ముందుగా గ్రామ టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అరాచక వైసీపీ పాలనకు చరమగీతం గీతం పాడేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థుల గెలు పే అందరి లక్ష్యం కావాలన్నారు. పనులు, ఉద్యోగాల నిమిత్తం సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అందరూ కృషి చేయాలన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ధ్యేయంతో ఉన్న పవన్‌కల్యాణ్ ఆశయాన్ని జనసేన పార్టీ కార్యకర్తలు నెరవేర్చాలని ఏలూరి కోరారు. అనంతరం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి దుర్మార్గ, చేతగాని పాలనపై ప్రజలు విసుగుచెందారన్నారు. మే 13న మీ అమూల్యమైన ఓటును సైకిల్‌కు వేసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ద్రోణాదుల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ ఇంటింటికీ తిరిగారు. వైసీపీ పాలనలో గ్రామంలో సమస్యలు పరిష్కరించలేదని పలువురు ఏ లూరి దృష్టికి తెచ్చారు. విద్యా పథకాలు అమలుకాక వి దేశీ విద్యకు దూరమయ్యారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అన్ని పథకాలు అమలు చేసి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

మార్టూరు : కూటమి టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు 25, 26వ బూత్‌లలో ముస్లిం కాలనీ, రాయల్ హైస్కూల్, ఎస్‌టీ కాలనీలో ప్రచారం చేశారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఏలూరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాక మార్టూరులో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్టూరులో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే చంద్రబాబు పాలన రావాలన్నారు. చేతగాని జగన్‌రెడ్డి పాలనతో గాడితప్పిన రాష్ట్రాన్ని బాగుచేసే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి వ్యాపారం బాగా పెరిగిపోయిందని, దీంతో పిల్లల భవిష్యత్ నాశనమయ్యే ప్రమాదముందని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాలు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అందరూ విజ్ఞతతో ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఏలూరి కోరారు.

కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రావినేని శ్రీనివాసరావు, జంపని శ్రీను, చల్లగుండ్ల సుబ్బారావు, కాకోలు వెంకటేశ్వర్లు, పున్నారావు, తెలుగు మహిళలు ఉప్పుటూరి రమాదేవి, జంపని రాధ, శేషమ్మ, కస్తూరి, అరుణ పాల్గొన్నారు.



17వ వార్డులో ముస్లిం మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న గొట్టిపాటి

మద్య నిషేధంపై మాటతప్పిన జగన్‌రెడ్డి

- ఐదేళ్లలో అన్నివర్గాల ప్రజలకు మోసం
- టీడీపీ కూటమితోనే సమ న్యాయం
- ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 23 : మద్యంను నిషేధిస్తానని, అది అమలు చేశాకే ఓటు అడిగేందుకు వస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేసే పథకాలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను గొట్టిపాటి వివరించారు. పాదయాత్రలో, గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని జగన్‌రెడ్డి నెరవేర్చలేదన్నారు. మాటిచ్చి మడమ తిప్పితే ఓట్లు వేయొద్దని పదేపదే చెప్పున్న జగన్‌రెడ్డికి ప్రజలు ఓటెలా వేస్తారని గొట్టిపాటి ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, కరెంట్ చార్జీల పెంపు, ఇసామిక్ బ్యాంక్ ఏర్పాటు, బీసీలకు రాజకీయపరమైన రిజర్వేషన్ తదితర హామీలపై ప్రజలకు జగన్ ఏం సమాధానమిస్తారన్నారు. టీడీపీ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచారని పదేపదే చెప్పిన జగన్‌రెడ్డి ఐదేళ్లలో 9 సార్లు చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి వర్గాలకు షాక్ కొట్టించారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే డీఎస్సీపై సంతకం చేస్తారన్నారు. వైసీపీ దోపిడీ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేది ఓటర్లేనన్నారు. అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం టీడీపీ కూటమితోనే సాధ్యమన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ కూటమి ఎంపీగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే తనను ఆశీర్వదించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ఆయనకు ముస్లిం, ఎస్సీ కుటుంబాల నుంచి మంచి స్పందన వచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు డాక్టర్ ఫణీంద్రబాబు, చిన్ని శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, వలి, మదీనా, సాయి, కాకాని అశోక్, కుందారపు రామారావు పాల్గొన్నారు.

హనుమకు లక్ష తమలపాకుల పూజ



అద్దంకి, ఏప్రిల్ 23 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. వేకువజామునే సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, పూజారులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

క్వారీలో కేబుల్ వైరు చోరీకి యత్నం

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని కొండాయపాలెం గ్రామ పరిధిలోని వింటర్ గ్రానైట్ క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పవర్ కేబుల్ వైరు చోరీకి యత్నించారు. క్వారీలో లక్షలు విలువ చేసే కేబుల్ వైరును కట్ చేసి దొంగిలించే ప్రయత్నం చేస్తుండగా వాచ్‌మన్ గమనించి కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు.

బాబు గ్యారెంటీ పథకాలతో మహిళలకు చేయూత



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న గొట్టిపాటి కమల్‌కిషోర్

బల్లికురవ, ఏప్రిల్ 23 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ గ్యారెంటీ పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని టీడీపీ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన గొట్టిపాటి రవికుమార్, కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్లికురవలో బాబీ గొట్టిపాటికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిరహించారు. జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. అన్నీ చేసినట్లు ఆయన చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో మాటిచ్చి మ డమ తిప్పారన్నారు. ఐ దేళ్లుగా మీరున్న గ్రామాల్లోనే అభివృ ద్ధి చేయని జగన్‌రెడ్డి రాష్ట్రం తా అభివృద్ధి చేశామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. కనీసం రోడ్డును కూడా వేయలేని చేతగాని వైసీపీ పాలకులను ప్రజలంతా ఒ క్కటై ఓటుతో వేటు వేయాలని బాబీ పిలుపునిచ్చారు. మీరేసే ఓటు రాష్ట్ర అభివృద్ధి కోసం.. మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం అని గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య పాలన, ప్రజల కష్టాలు తీరే రోజులు వస్తాయన్నారు. బాబు రాగానే డీఎస్సీతో యువతకు ఉద్యోగాలు, పెద్ద ఎత్తున కంపెనీలను తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను తీర్చుతారని బాబీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, భైరపునేని ఆజయ్, గొట్టిపాటి కొండలు, సర్పంచ్ పందిరి అంజిబాబు, చల్లగుండ్ల నాగేశ్వరరావు, నాగబోయిన సింగారావు, గరిమిడి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మహిళలకు 'మహాశక్తి' భరోసా

ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 23 : మహిళలకు మహిళా శక్తి పథకాలతో భరోసా ఉంటుందని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాలను ఝాన్సీ మహిళలకు వివరించారు. తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.1500 ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. ముఖ్యమంగా మహిళలను ఆర్థిక బలవంతులను చేయాలన్న లక్ష్యంతో చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గాస్ సిలిండర్లు, స్వయం గ్రూపులకు రూ.10లక్షల వడ్డీలేని రుణాన్ని అందజేస్తారన్నారు. మాయమాటలు, చేతగాని పాలనతో జగన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. వజ్రాయుధం లాంటి ఓటుతో వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపాలని, మహిళలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పలువురు మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.



భగవాన్‌రాజుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ


వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి, చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండలంలోని కొణిదెన గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి, కొత్తపాలెంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. దేవతామూర్తుల విగ్రహాల వద్ద భక్తులు పెద్ద ఎ త్తున కూర్చొని కల్యాణ వేడుకను నిర్వహించారు. కొణిదెనలో జరిగిన కల్యాణాన్ని ఆలయ ఈవో వెం కటేశ్వరరావు పర్యవేక్షించారు. దేవాలయ అర్చక స్వామి ఐవీఎన్‌ఎస్ అచార్యులు పర్యవేక్షనలో జరిగాయి. ఈసందర్భంగా రెండు గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వీర్ల గంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో వీర్ల గంగమ్మ



విద్యుత్ దీపాల కాంతిలో ఆలయం

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలోని వీర్లకొండ వద్ద వీర్ల గంగమ్మ తల్లి వార్షిక తిరునాళ్లను భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. మల్లాయపాలెం, కొండాయపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొత్తపాలెం, సోమవరప్పాడు, వేమవరం, చెన్నుపల్లి, కొప్పెరపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గంగమ్మ తల్లిని దర్శించుకొని మొక్కుబడి పొంగళ్లు చెల్లించారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌తో విద్యుత్ ప్రభలు లేకపోవడంతో భక్తులు పగలే అధిక సంఖ్యలో గంగమ్మ దేవాలయానికి వచ్చారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కుబడి విద్యుత్ ప్రభ వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీర్ల గంగమ్మ ఆలయం నలువైపులా గ్రానైట్ క్వారీలు పెద్ద ఎత్తున ఉండడంతో గ్రానైట్ క్వారీల యజమానులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా గంగమ్మను దర్శించుకున్నారు. దేవాలయ పూజారి చల్లగుండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

6వ రోజు నాలుగు నామినేషన్లు

చీరాల, ఏప్రిల్ 23 : ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో పఠాన్ కాలేషా (స్వతంత్ర అభ్యర్థి), వెంకటేశ్వర్లు శీలం (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక), ఆమంచి కృష్ణమోహన్ (కాంగ్రెస్) తమ నామినేషన్ పత్రాలను ఆర్వో సూర్యనారాయణరెడ్డికి అందజేశారు. కరణం వెంకటేష్ (వైసీపీ) నామినేషన్ పత్రాలను ఆయన తరఫున వేరేవారు అందజేశారు.

కరణం వెంకటేష్ ఆస్తులు రూ.30.24 కోట్లు

వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తన స్థిర, చరాస్తులు రూ.30.24 కోట్లు ఉన్నట్లు నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరు మీద చరాస్తులు రూ.5.01 కోట్లు, భార్య గీత పేరు మీద రూ.3.77 కోట్లు, ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్తి తన పేరుమీద రూ.13.37 కోట్లు ఉన్నాయని, భార్య పేరుపై రూ.8.06 కోట్లు ఉన్నట్లు చూపారు. ఇక అప్పులు ఇద్దరికి కలిపి రూ.4.75 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరి వద్ద కలిపి రూ.75వేలు నగదు ఉందని పేర్కొన్నారు. ఫార్చ్యూన్ కారు, ఒక స్పోర్ట్స్ బైక్ ఉన్నాయని, కేసులు లేవని పేర్కొన్నారు.

ఆమంచి ఆస్తులు రూ.25.75 కోట్లు

కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌తో పాటు ఇచ్చిన అఫిడవిట్‌లో తన వద్ద స్థిర, చరాస్తులు రూ.25.75 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో తన పేరు మీద రూ.14.04 కోట్లు, తన భార్య సుజాత పేరుమీద రూ.11.70 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరి పేరున అప్పులు రూ.7.18 కోట్లు ఉన్నట్లు చూపారు. ఇద్దరి వద్ద నగదు రూ.17.68 లక్షలు ఉన్నట్లు చూపారు. తనకు వాహనాలు లేవని పేర్కొన్నారు. తనపై 13 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

నామినేషన్ వేసిన బాలాజీ

పర్చూరు : పర్చూరు వైసీపీ అభ్యర్థిగా యడం బాలాజీ మం గళవారం నామినేషన్ దాఖలు చేసారు. వైసీపీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ నందిగాం సురేష్, రాజ్యసభ సభ్యులు వైసీ పీ బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రావి రామనాథంబాబుతో కలసి ర్యాలీగా వచ్చి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందజేశారు.

అడుసుమల్లి నామినేషన్ దాఖలు


అద్దంకి : అద్దంకి నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి గా అడుసుమల్లి కిషోర్‌బాబు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కిషోర్‌బాబు నామినేషన్ ప త్రాలను రిటర్నింగ్ అధికారి సునీల్ కు అందజేశారు. కాం గ్రెస్ నాయకులు సురేం ద్ర తదితరులు పాల్గొన్నారు.



మండుటెండలో ఆటోలో పనులకు వెళ్తున్న కూలీలు

భానుడి భగభగలు

- పెరిగిన ఎండలు, వడగాలులు
- విలవిల్లాడుతున్న కూలీలు



చెట్టు నీడన సేదతీరుతున్న కూలీలు

బల్లికురవ, ఏప్రిల్ 23 : పొట్ట కూటి కోసం రోజువారీ కూలీలు మండు టెండలలో కూడా పనులకు వలస వెళుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కూలీలు మాత్రం గ్రామాలలో పనులు లేక పొరుగు ఊళ్లకు వెళుతున్నారు. ఒక వైపు ఎండ మండుతున్నా ఉదయం నుంచే ఆటోలలో వెళుతున్నారు. మండలంలోని గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, నక్కబొక్కలపాడు, కొణిదెన, మల్లాయపాలెం, ముక్తేశ్వరం, ఉప్పుమాగులూరు, తదితర గ్రామాల నుంచి కూలీలు పనులకు వెళుతున్నారు. ఒక్కో కూలికి మిర్చి కోతకు రూ.400 ఇస్తున్నారు. ఎండ కాసినా పొట్ట కూటి కోసం ఇబ్బంది పడి వెళ్లాల్సిందేనని కూలీలు అంటున్నారు. ఒక్కోసారి ఎండలను తట్టుకోలేక చెట్ల కింద సేద దీరుతున్నారు. కూలీలను చూసిన వారు వారి కష్టాలను చూసి అయ్యోపాపం అంటున్నారు. 44 డిగ్రీల ఎండ కాస్తున్న కూలీలు మాత్రం తమ పనులకు వెళ్లక తప్పని పరిస్థితి. కూలీలు తగు జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బబారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు కూలీలకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యంపై తగు చర్యలు చేపట్టాలి.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న వైద్యశాలల అధికారి శేషుకుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 23 : వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించిందుకు అందరూ కృషి చేయాలని బాపట్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఏపీ శేషుకుమార్ అన్నారు. మంగళవారం అద్దంకి సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఆయా విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యశాలలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ కేసులు, వాటి నమోదు వివరాల వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బ్లడ్ బ్యాంక్, ట్రామా కేసులు, శస్త్ర చికిత్సలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంటి విభాగంలో రోగులకు కళ్ల జోళ్ళను ఆ యన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ కె.వాహిలా చౌదరి, డాక్టర్ పి. వెంకట కిరణ్, డాక్టర్ కె. శ్యామ్‌బాబు, డాక్టర్ జి. ప్రదీప్తి, డాక్టర్ లక్ష్మి శ్రుతి కీర్తి, డాక్టర్.టి. సురేంద్ర, డాక్టర్ విష్ణు , సిబ్బంది పాల్గొన్నారు.

రత్తమ్మ మృతదేహానికి టీడీపీ నేతల నివాళి



రత్తమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చినగంజాం, ఏప్రిల్ 23 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పర్వతరెడ్డి రత్తమ్మ(70) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ సానుభూతి పరులైన రత్తమ్మ మృతి విషయాన్ని తెలుసుకున్న నాయకులు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పొద వీరయ్య, ఆజాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, నాయకులు టీ.జయరావు, నరహరి శ్రీనివాసరావు, శిఖరం రాంబాబు, పర్వతరెడ్డి పార్థసారిథి, గంటా వెంకటనారాయణ, పల్లపోలు శ్రీనివాసరావులు రత్తమ్మ మృతదేమాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. రత్తమ్మ భర్త పెద సుబ్బయ్య కుమారులను నాయకులు పరామర్శించారు.

గ్రానైట్ రాయి లారీల పట్టివేత



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గ్రానైట్ లారీలు

బల్లికురవ, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి ఇతర ప్రాంతాలకు ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ ముడి రాయి లారీలను మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్ పట్టుకొన్నారు. వీర్ల కొండ క్వారీల నుంచి ఒంగోలు, మార్టూరు, వేమవరం ప్రాంతాలలో ఉన్న ఫ్యాక్టరీలకు రాయిని తరలిస్తుండగా మైనింగ్ అధికార్లు మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు చేయగా ఎలాంటి పర్మిట్లు లేకపోవడంతో కేసు నమోదు చేసి వెంటనే నాలుగు లారీలను బల్లికురవ పోలీసు స్టేషన్‌కు మైనింగ్ అధికారులకు అప్పగించారు. లారీలకు పెనాల్టీలు విధించనున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం, ఏప్రిల్ 23 : మండలంలోని కడవకుదురు ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ని చీరాల ఎస్ఈబీ ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం పట్టుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని కడవకుదురు గ్రామం వద్ద పట్టుకొని, సీజ్ చేసి తదుపరి చర్యలు నిమిత్తం చినగంజాం పోలీసుస్టేషన్లో అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరరావు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

144 బాటిళ్లు, కారు సీజ్

పర్చూరు, ఏప్రిల్ 23 : కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, 144 బాటిళ్ల, కారును సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ భుజంగరావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా యద్దనపూడి నుంచి కారులో మద్యంను అక్రమంగా తరలిస్తున్న నిందుతులను అరెస్టు చేశామన్నారు. మద్యంతోపాటు కారును సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.